సాక్షి అనంతపురం

శుక్రవారం ၊ 13 ၊ జూన్ ၊ 2025



టన్ను చీనీ రూ.33,640

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33,640వేల ప్రకారం ధర పలికాయి.



ఆక్రమణలు తొలగించండి

చెరువులు, వాగులు, వంకల్లో ఆక్రమణలు తొలగించాలని జేసీ శివ్‌నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. 8లో

గరిష్టం/కనిష్టం
31.7°/22.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

తన్మయిది ప్రభుత్వ హత్యే

- మృతదేహానికి రీ పోస్టుమార్టం చేయాలి
- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతాం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు 'అనంత'
- పార్టీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో నగరంలో నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గిరిజనులు

అనంతపురం కార్పొరేషన్: తమ బిడ్డ తన్మయి కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు ఆలస్యంగా స్పందించారని, దర్యాప్తు ముమ్మరం చేయడంలో వెనుకంజ వేశారని, తన్మయిది ప్రభుత్వ హత్యేనని ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో జరిగిన నిరసన ర్యాలీకి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ముందుగా అంబేద్కర్, దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్, సూర్యనగర్ సర్కిల్, సంగమేశ్వర సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గిరిజనులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. కలెక్టరేట్ ముందు బైఠాయించారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతలు తన్మయి తండ్రి లక్ష్మీపతితో కలసి కలెక్టరేట్‌లో ఆర్‌డీఓ మలోలకు వినతి పత్రం సమర్పించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ జూన్ 3న తన్మయి అదృశ్యమై 7న శవమై కన్పించిందన్నారు. ఫోరెన్సిక్ రిపోర్టులో 5నే తన్మయిని చంపేసి ఉండొచ్చని తెలియజేశారన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల పాటు యువతి ఎవరి ఆధీనంలో ఉందనే వివరాలను పోలీసులు ఎందుకు తెలపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సగటున రోజుకు ఇద్దరు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. తన్మయి కుటుంబ సభ్యులు నలుగురిపై అనుమానం వ్యక్తం చేశారని, వారిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు యువతి మృతదేహానికి రీ పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు తీరిక లేదా..?

యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని రామకృష్ణ కాలనీలో తన్మయి కుటుంబం ఉంటోందని, కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించే తీరిక కూడా కలెక్టర్‌కు లేదా అని ప్రశ్నించారు. గిరిజన కుటుంబానికి జరిగిన అన్యాయంపై వినతి పత్రం అందించేందుకు వస్తున్నామని చెబితే కలెక్టర్ పత్తా లేకుండా పోయారన్నారు. దీన్ని బట్టి దళితులు, గిరిజనుల పట్ల ఏ స్థాయిలో చిన్నచూపు వైఖరి ప్రదర్శిస్తున్నారో అర్థమవుతోందన్నారు. గిరిజనులు, దళితులకు న్యాయం చేస్తామని గతంలో నారా లోకేష్ చెప్పారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని చెప్పిన పవన్ కల్యాణ్ ఇప్పుడు మహిళలకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తన్మయి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసబాబు నాయక్, 'ట్రైకార్' మాజీ చైర్మన్ గుండా సురేంద్ర పేర్కొన్నారు. అనంతరం రామకృష్ణ కాలనీలోని తన్మయి నివాసానికి వెళ్లి మృతురాలి తల్లిదండ్రులను ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు, తదితరులు పరామర్శించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశ్వర్థ్ నాయక్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, పార్టీ ఎస్టీ సెల్ నాయకులు సాకే శ్రీనివాసులు, గోవింద్‌నాయక్, మిద్దె నగేష్, గుజ్జల శివ, గుజ్జల లక్ష్మణ్‌కుమార్, సాకే రాజశేఖర్, రాజు నాయక్, మోహన్ నాయక్, గౌతం నాయక్, అంజనమూర్తి, సాకే శివశంకర్, ఆదిశేషు, మహిళా నాయకురాళ్లు చంద్రలేఖ, శోభాబాయి, శోభారాణి, దేవి, ఉష, భారతి పాల్గొన్నారు.



డీఆర్‌ఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ ఎస్టీ సెల్ నేతలు

న్యాయం జరిగే వరకూ పోరాటం

గిరిజన యువతి దారుణ హత్య విషయంలో ఓ సీఐను సస్పెన్షన్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటామంటే చూస్తూ ఊరుకోబోమని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసే వరకూ పోరాటం ఆపమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత స్పష్టం చేశారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఐదు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందని, ఆ ప్రాంతంపై టీడీపీకి పట్టుండడంతో ఎవరూ నోరు మెదపడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. ఏడాది కూటమి పాలనలో 188 మందిపై అత్యాచారాలు జరిగాయని, అందులో 15 మంది మహిళలు హత్యకు గురయ్యారని చెప్పారు. బాధ్యత గల పదవిలో ఉన్న హోంమంత్రి అనిత హత్యలు జరుగుతుంటే తన వద్ద లాఠీ లేదు, తుపాకీ లేదు అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారని, ఇంతకన్నా సిగ్గుచేటు మరొకటి లేదని దుయ్యబట్టారు.

న్యూస్‌రీల్

యోగాతో ఒత్తిడి దూరం



యోగాసనాలు వేస్తున్న కమాండెంట్ ప్రభుకుమార్, అధికారులు

బుక్కరాయసముద్రం: యోగా ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న బెటాలియన్‌లో 'యోగాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ ప్రభుకుమార్ మాట్లాడుతూ నిత్యం ధ్యానం, యోగా చేస్తే మంచి ఆరోగ్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ దేవి, అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, యోగా శిక్షక్ పతాంజలి డిస్ట్రిక్ ప్రొప్రయిటర్ డాక్టర్ రవి ప్రసాద్, డీఎస్పీలు ప్రసాద్‌రెడ్డి, వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

నా పిల్లిని చంపార్సార్

- పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు



గార్లదిన్నె: తాను పెంచుకుంటున్న పిల్లిని చంపారంటూ కొందరిపై ఓ వ్యక్తి గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల మేరకు.. మండల పరిధిలోని క్రిష్టాపురానికి చెందిన రామాంజనేయులు తన ఇంట్లో పిల్లిని పెంచుకుంటున్నాడు. ఇటీవలే అది పిల్లలకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో ఇంటి వద్ద చెట్టుపై ఉన్న పిల్లిని గురువారం కల్లూరుకు చెందిన కొంత మంది వేటగాళ్లు పట్టుకొని చంపేశారు. ఈ క్రమంలో ఆవేదన చెందిన రామాంజనేయులు.. మూగజీవాన్ని చంపిన వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలని గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రెవెన్యూలో బది'లీలలు'

- 9న జారీ చేసిన ఉత్తర్వుల్లో మార్పులు
- అదే తేదీతో తిరిగి ఉత్తర్వుల జారీ

అనంతపురం అర్బన్: గడువు ముగిసినా రెవెన్యూశాఖలో బది'లీలలు' కొనసాగించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. తాజాగా 11 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 8 మంది సీనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం కల్పించారు. డీటీలు, ఎస్ఏల బదిలీలకు సంబంధించి ఈనెల 9వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల్లో మార్పులు చేర్పులు చేశారు. అయితే, అదే తేదీపైనే ఉత్తర్వులను జారీ చేయడం గమనార్హం. రాజకీయ సిఫార్సుల మేరకు డీటీలు, ఎస్ఏల బదిలీల్లో మార్పు చేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మార్పులు ఇలా..

ఈనెల 9వ తేదీన 32 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 38 మంది మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అకౌంటెంట్లను బదిలీ చేశారు. తాజాగా 9వ తేదీనే పొందుపరుస్తూ ప్రస్తుతం జారీ చేసిన 11 మంది డీటీలకు సంబంధించిన బదిలీ ఉత్తర్వుల్లో... డీటీలు టి.కె.చంద్రశేఖర్ రావు, ఎం.ఆంజనేయప్రసాద్, ఎం.కె.సూర్యనారాయణ, టి.బసవకుమార్, ఇ.వెంకటేశ్వర్లు స్థానాలను మార్పు చేశారు. అదే విధంగా 8 మంది ఎస్ఏల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వుల్లో... జి.జీవన్ విజయ్ కుమార్, కె.వెంకటరామిరెడ్డి, వి.సందీప్, ఆర్.రాజేష్ కుమార్‌కు స్థానాలు మార్పు చేశారు.

జిల్లా అంతటా వర్షం

- విడపనకల్లులో అత్యధికంగా 91.2 మి.మీ వర్షపాతం
- రాగల రెండు రోజులూ జిల్లాకు వర్షసూచన



కణేకల్లు: వేదవతి హగిరిలో ప్రవహిస్తున్న వరదనీరు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాపై నైరుతి రుతుపవనాలు ప్రభావం చూపుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 30 మండలాల పరిధిలో 18.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా విడపనకల్లు మండలంలో 91.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కణేకల్లు 59 మి.మీ, ఉరవకొండ 40.6, డి.హీరేహాళ్ 40, బెళుగుప్ప 36.4, యాడికి 27.8, శింగనమల 26.2, కళ్యాణదుర్గం 25.4, గుత్తి 22.8, గుంతకల్లు 21.4, అనంతపురం అర్బన్ 21.4, రాయదుర్గం 20.4, గార్లదిన్నె 19.2, వజ్రకరూరు, అనంతపురం రూరల్ 18.2, బుక్కరాయసముద్రం 16.2 , గుమ్మఘట్ట 14.8, కుందుర్పి 10.6, బ్రహ్మసముద్రం 10 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పంటల సాగుకు ఈ వర్షాలు ఊతమిస్తాయని అధికారులు తెలిపారు. రాగల రెండు రోజులు కూడా జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

అన్యాయం జరిగినా స్పందించకూడదా?

- 'సాక్షి' పత్రికలో రాకుంటే దారుణం బయటకు వచ్చేదేకాదు
- మాజీ మంత్రులు మేరుగ నాగార్జున, శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగ నాగార్జున, చిత్రంలో మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఈరలక్కప్ప తదితరులు

రాప్తాడురూరల్: 'దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా ఒక దళిత మైనర్ బాలికకు ఘోరమైన అన్యాయం జరిగింది. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసులతో అడ్డుకుంటారా.. మేమేమైనా టెర్రరిస్టులమా..' అని మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నగర శివారులోని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేరుగ నాగార్జున మాట్లాడుతూ 14 ఏళ్ల దళిత బిడ్డను 18 మంది అఘాయిత్యం చేసిన ఘటనపై స్పందించి అండగా నిలిచేందుకు వస్తే అరెస్ట్ చేశారన్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో ఎలాంటి ప్రజాస్వామ్యం ఉందో, ఈ ప్రాంతంలో ఎలాంటి పాలన సాగుతోందో అర్థమవుతోందన్నారు. హోం మంత్రి, ఈ ప్రాంతంలోని ఎస్సీ శాసనసభ్యులు ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. టీవీలో ఎక్కడో ఏదో మాట్లాడారంటూ అరెస్టులు చేస్తున్న ప్రభుత్వం, దళిత బిడ్డకు జరిగిన అన్యాయంపై ఎందుకు స్పందించలేదన్నారు. దీనిపై గవర్నరును కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

దళితురాలిగా పుట్టడమే నేరమా..

దళితులుగా పుట్టడం తప్పా అందులోనూ బాలికగా పుట్టడం నేరమా అని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ప్రశ్నించారు. దళిత బాలికపై అఘాయిత్యానికి పాల్పడినందుకు పేరూరులో విజయోత్సవాలు చేసుకున్నారా.. లేదంటే తమ దెబ్బకు ఎవరినీ రానీయలేదన్నందుకు విజయోత్సవాలు చేసుకున్నారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కచ్చితంగా ఆ గ్రామానికి వెళ్లి తీరతామన్నారు. దీనిపై ప్రత్యేక జ్యుడీషియల్ విచారణ జరగాలన్నారు. 'సాక్షి' పత్రికలో వార్త వస్తే తప్ప ఈ ఘోరం వెలుగులోకి రాలేదని వాపోయారు.

ప్రత్యేక పాస్‌పోర్ట్ కావాలా..

బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తుంటే ఎక్కడికక్కడ పోలీసులను పెట్టి అడ్డుకున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆ ప్రాంతాలకు వెళ్లేందుకు వీసాలు తీసుకోవాలా.. పాస్‌పోర్టులు ఉండాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామూహిక అత్యాచారం కేసులో నిందితుల బంధువులు, టీడీపీ శ్రేణులు, పరిటాల సునీత బంధువులు పేరూరులో తమ వాహనాలపై రాళ్లతో దాడి చేసి భయోత్పాతం సృష్టించారన్నారు. పరిటాల సునీత అండతోనే కర్రలు, ఇతర మారణాయుధాలతో వీరంగం సృష్టించారన్నారు. పోలీసులు సమాజానికి ఎలాంటి మెసేజ్ ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. 2014–2019 మధ్య జరిగిన అన్యాయాలు, దౌర్జన్యాలను ప్రశ్నించిన తనను రామగిరి మండలంలోకి అడుగు పెట్టనివ్వలేదని, దాని ఫలితం అనుభవించారన్నారు. మహిళా ఎమ్మెల్యేగా ఉన్న సునీత ఇలాంటి ఘటనలను ప్రోత్సహించడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, మధుమతి రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పెన్నోబులేసు తదితరులు పాల్గొన్నారు.

తెల్లవార్లూ టీచర్ల కౌన్సెలింగ్





హాజరైన ఉపాధ్యాయులు, కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న పరిశీలకులు సుబ్బారావు, డీఈఓలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్జీటీ టీచర్ల కౌన్సెలింగ్ తెల్లవార్లూ కొనసాగింది. తొలిరోజు 350 మంది పూర్తవగా... రెండోరోజు గురువారం సీరియల్ నంబరు 351 నుంచి 1,000 దాకా పిలిచారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ తెల్లవార్లూ కొనసాగింది. కాగా శుక్రవారం ఉదయం 11 గంటలకు సీరియల్ నంబరు 1,001 నుంచి 1,800 వరకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

టీచరుపై రెచ్చిపోయిన పరిశీలకులు

'బొచ్చు గాడివి నీకేం సమాధానం చెప్పాలి' అంటూ ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్‌లో పరిశీలకులుగా వచ్చిన జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు గురువారం ఓ టీచరుపై రెచ్చిపోయారు. దీంతో కౌన్సెలింగ్ కేంద్రంలో కొద్దిసేపు తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన మేరకు...తనకల్లు మండలంలో ప్రభాకర్ టీచరుగా పని చేస్తున్నారు. ఈయన భార్య స్పౌజ్ పాయింట్లు వాడుకున్నారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్ సమయంలో భర్త పని చేస్తున్న తనకల్లు మండలంలోనే కోరుకోవాలంటూ అధికారులు సూచించారు. ఈ సమయంలో కలగజేసుకున్న భర్త ప్రభాకర్... సర్ తనకల్లు మండలం కాకుండా పక్క మండలం కదిరి రూరల్‌లో ఇచ్చేలా చూడాలని కోరారు. అలా కుదరదని 'స్పౌజ్' విషయంలో అందరికీ ఒకే నిబంధన పాటిస్తున్నామంటూ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో సదరు టీచర్.. 'అన్నీ కరెక్ట్‌గా చేశామంటున్నారు.. అలా చేసినట్లు రాతపూర్వకంగా ఇవ్వండి' అంటూ అడిగారు. దీంతో అక్కడే ఉన్న పరిశీలకులు సుబ్బారావు రెచ్చిపోయారు. 'నువ్వు బొచ్చుగాడివి అడిగితే మేము చెప్పాలా' అని మాట్లాడారు. సదరు టీచరు కూడా అంతేస్థాయిలో సమాధానం ఇచ్చారు. సాధారణ టీచరుకు ఇచ్చే గౌరవం ఇదేనా.. అని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది అంతా వేదికపైకి దూసుకురావడంతో కాసేపు గందరగోళం నెలకొంది. అందరూ సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

పరామర్శపై పైశాచికం!

- వైఎస్సార్ సీపీ నాయకులపై అధికార జులుం
- అత్యాచార బాలిక కుటుంబాన్ని పరామర్శించకుండా అడ్డంకులు
- పోలీసులను ఉసిగొల్పిన ఎమ్మెల్యే పరిటాల సునీత

తండ్రి మరణించాడు..తల్లి మతిస్థిమితం సరిగా లేదు.. ఏ ఆధారమూ.. ఎవరి అండాలేని దళిత మైనర్ బాలికపై 14 మంది కీచకులు నెలల తరబడి అత్యాచారానికి పాల్పడితే... నేటికీ బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత పరామర్శించలేదు. పైగా ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా నిలిచేందుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులనూ అడ్డుకున్నారు. పోలీసులను ఉసిగొల్పి, రౌడీ మూకలతో రాళ్ల దాడి చేయించి భయానక వాతావరణం సృష్టించి పైశాచిక ఆనందం పొందారు.

సాక్షి, పుట్టపర్తి/పెనుకొండ రూరల్/చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి: సామూహిక అత్యాచారానికి గురైన రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లికి చెందిన మైనర్ దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం ఉదయం బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులను ఇటు పోలీసులు... అటు పచ్చ రౌడీలు అడుగడుగునా అడ్డుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే ఎమ్మెల్యే సునీత పోలీసులను అడ్డుపెట్టుకొని భయభ్రాంతులకు గురిచేశారు.

అడుగడుగునా ఆటంకాలే..

ఏడుగుర్రాలపల్లిలోని దళిత బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఉదయం పేరూరు బయలుదేరారు. పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, ఎన్ఎస్ గేటు, రామగిరి, నసనకోట, ఎగువపల్లి, మామిళ్లపల్లి, కనగానపల్లి, తగరకుంట, వేపకుంట, మద్దెలచెరువు తదితర ప్రాంతాల్లో మకాం వేసిన పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్లు వాహనాల్లో ఎక్కించుకుని తీసుకెళ్లారు. అంతకుముందు పెనుకొండ వద్ద జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పేరూరు వైపు వస్తుండగా పెనుకొండ సమీపంలో జాతీయ రహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. ఎన్ఎస్ గేటు వద్ద మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను అడ్డుకుని వెనక్కి పంపించారు. కనగానపల్లి మండలం మద్దెలచెరువు వద్ద మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డిని పోలీసులు అడ్డగించారు. ఎందుకు అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రశ్నిస్తే.. పేరూరు వెళ్లేందుకు అనుమతులు తీసుకోవాలని, అంతవరకూ అంగీకరించేది లేదని పోలీసులు వాగ్వాదానికి దిగారు.



పేరూరుకు వెళ్లకుండా మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

వాస్తవాలు బయటికి వస్తాయనే..

దళిత బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన అల్లరి మూకలు ఎమ్మెల్యే సునీత అండదండలతో కొన్నాళ్లు తప్పించుకు తిరిగారు. విషయం బహిర్గతం కావడంతో ఇప్పటికే 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. ఇలాంటి సమయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏడుగుర్రాలపల్లికి వెళ్తే.. మరిన్ని విషయాలు బహిర్గతం అవుతాయనే ఉద్దేశంతో పక్కా ప్రణాళికతో పోలీసులను అడ్డుపెట్టుకుని సునీత దుర్మార్గంగా వ్యవహరించారని నేతలు విమర్శించారు. కాగా టీడీపీ నాయకుల ఒత్తిళ్లతోనే వైఎస్సార్‌సీపీ నేతల పర్యటనకు పోలీసుల నుంచి అనుమతులు లభించలేదు. పైగా నాయకులు ఇష్టారాజ్యంగా గ్రామాలకు వెళ్తే ఊరుకునేది లేదని ఎస్పీ వి.రత్న తెలపడం గమనార్హం.



ధ్వంసమైన వాహనం

పక్కా ప్లాన్‌తోనే దాడి..


పోలీసులు ఆటంకాలు సృష్టించినా...వైఎస్సార్ సీపీ కార్యకర్తలు కొందరు పేరూరుకు చేరుకున్నారు. అయితే ముందస్తు ప్రణాళిక ప్రకారం అక్కడే మకాం వేసిన టీడీపీ అల్లరిమూకలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వెళ్లిన వాహనాలపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. పోలీసుల సమక్షంలోనే టీడీపీ రౌడీలు రాళ్లు రువ్వగా.. వాహనాలు ధ్వంసమయ్యాయి.

టీడీపీ సంబరాలు..

వైఎస్సార్‌సీపీ నేతల పర్యటన గురించి తెలిసిన వెంటనే గొడవలకు ప్లాన్ చేసిన టీడీపీ నేతలు.. ఉన్నఫలంగా పేరూరులో సంబరాలు చేశారు. తల్లికి వందనం విడుదల సందర్భంగా ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చి మద్యం తాగి నానా రభస చేశారు.

ఇన్‌చార్జ్‌ల పాలనకే మొగ్గు

- ఐదు మండలాలకు తహసీల్దార్లను నియమించలేదు
- ఆర్‌డీఓ కార్యాలయ డీఏఓ పోస్టూ ఖాళీ
- డీటీల బదిలీల్లో ఐదేళ్ల నిబంధన గాలికి
- ప్రక్రియ ముగిశాక కూడా బదిలీలు





అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగంలో అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన సాగిస్తే ప్రజలకు సత్వర సేవలు అందక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ విషయం అధికారులకు తెలిసినా మండల స్థాయిలో ఇన్‌చార్జ్‌ల పాలనకు తెరదించే దిశగా చర్యలు చేపట్టలేదనే విమర్శలు రెవెన్యూ వర్గాల నుంచే వస్తున్నాయి. ఈ నెల 9వ తేదీతో బదిలీల ప్రక్రియ ముగిసినా... దీర్ఘ కాలికంగా ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతున్న కూడేరు, విడపనకలు, వజ్రకరూరు, కణేకల్లు, యల్లనూరు మండలాలకు తహసీల్దార్లను నియమించలేదు. దీంతో ఆయా మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన తప్పనిసరి అయింది. ఇక అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిపాలనాధికారి పోస్టులోనూ ఎవరినీ నియమించలేదు. దీన్ని బట్టి చూస్తే మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలనకే ఉన్నతాధికారులు మొగ్గు చూపించినట్లుగా స్పష్టమవుతోంది. ఇక బదిలీల ప్రక్రియ ముగిసినప్పటికీ... రెండో విడతగా డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు చేపట్టి (9న జారీచేసిన ఉత్తర్వుల్లో మార్పులు చేర్పులతో) అదే రోజు మరోమారు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం

కొరవడిన స్పష్టత

జిల్లాలో ఎనిమిది మంది తహసీల్దార్ల బదిలీలకు సంబంధించి ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేశారు. అందులో పుట్లూరు తహసీల్దారుగా ఉన్న శేషారెడ్డిని కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా నియమించారు. ఆ స్థానంలో ఉన్న యుగేశ్వరి దేవిని డి.హీరేహాల్ తహసీల్దారుగా నియమించారు. అక్కడున్న అనిల్‌కుమార్ (దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు) బెలుగుప్పకు బదిలీ చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే బదిలీలకు సంబంధించి ఈనెల 9న జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టత కొరవడింది. కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా నియమించిన శేషారెడ్డిని బుక్కరాయసముద్రం మండలం తహసీల్దారుగానూ... అక్కడున్న పుణ్యవతిని పుట్లూరుకు బదిలీ చేశారు. కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ సూపరింటెండెంట్ స్థానానికి ఎవరిని నియమించలేదు... అక్కడున్న యుగేశ్వరిదేవి డి.హీరేహాల్ తహసీల్దారుగా నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయలేదు. ఆమె నియామక ఉత్తర్వులు రద్దు చేస్తే డి.హీరేహాల్ మండలంలో ఇన్‌చార్జి పాలనలోకి తీసుకురావాలి. రద్దు చేయకపోతే కో–ఆర్డినేషన్ విభాగం బాధ్యతలు మరొకరికి అదనంగా అప్పగించాల్సి ఉంటుంది.

నిబంధన గాలికి

డిప్యూటీ తహసీల్దార్ల బదిలీల ప్రక్రియలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు సర్వీసు పూర్తి నిబంధన గాలికొదిలేశారు. కొందరికి ఇక్కడిక్కడే పోస్టింగ్ ఇచ్చారు. అధికారుల వద్ద సీసీ (క్యాంపు క్లర్క్)లుగా ఉన్న కొందరి భార్యలు కూడా రెవెన్యూలో విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీల ప్రక్రియలో వీరికి స్థానచలనం కల్పించలేదనే విమర్శలు రెవెన్యూవర్గాల నుంచే వస్తుండడం గమనార్హం.

ప్రజాప్రతినిధుల 'కనుసన్నల్లో'

తహసీల్దార్ల నియామకాలు పూర్తిగా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయనేది రెవెన్యూవర్గాల వాదన. ప్రధానంగా కొన్ని నియోజకవర్గాల పరిధిలో తహసీల్దారుగా ప్రజాప్రతినిధులు సూచించిన వారినే అధికారులు నియమించాలి. అలాకుండా అధికారులు సొంత నిర్ణయంతో తహసీల్దార్లను నియమిస్తే పరిస్థితి మరోలా ఉంటుంది. అలా నియమితులైన వారు విధుల్లోకి చేరకుండానే వెనుతిరగక తప్పదు.

క్లుప్తంగా

ఎండోమెంటు ఏసీకి సన్మానం



ఏసీ తిరుమలరెడ్డిని సత్కరిస్తున్న అర్చక సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, తదితరులు

అనంతపురం కల్చరల్: జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన తిరుమలరెడ్డిని జిల్లా అర్చక సంఘాలు గురువారం ఘనంగా సత్కరించాయి. జిల్లాలోని ఆలయాల్లో నెలకొన్న సమస్యలన్నీ సందర్భంగా అర్చక సంఘాల ప్రతినిధులను ఆయన అడిగి తెలుసుకున్నారు. జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ... గత ఏసీ వైఖరి వల్ల కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందని, సమస్యల పరిష్కారానికి కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఏసీ సానుకూలంగా స్పందిస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య సభ్యులు శ్రీనివాసులు, చంద్రమౌళి, తిరుపతయ్య, మధుసూదనాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, హాస్టళ్లకు సన్నబియ్యం పంపిణీ

అనంతపురం అర్బన్: జిల్లాలోని 1,715 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు, 183 సంక్షేమ వసతి గృహాలకు 25 కిలోల సంచుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంపిణీ ప్రక్రియలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి సంచిపైన క్యూఆర్ కోడ్ జతపర్చామన్నారు. దానిని స్కాన్ చేయడం ద్వారా బియ్యానికి సంబంధించి పూర్తి వివరాలు, ధాన్యం పండించిన రైతుల వివరాలు, నాణ్యత పరిశీలించిన సిబ్బంది సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు చూడాలని సూచించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పండిట్లు బలి

- సర్దుబాటు పేరుతో రెండేళ్లకోసారి బదిలీ అవుతున్న డీఈఓ పూల్‌లోని పండిట్లు
- ఆరేళ్లలో నాలుగోసారి బదిలీ అవుతున్నామంటూ ఆవేదన
- పాఠశాల విద్య ఆర్జేడీని అడ్డుకున్న పండిట్లు



ఆర్జేడీ శామ్యూల్‌ను ఘెరావ్ చేస్తున్న పండిట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఈఓ పూల్‌లో ఉన్న బాషా పండితుల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. అదే సమయంలో ఉపాధ్యాయ సంఘాలూ స్పందించడం లేదు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ గురువారం స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో జరుగుతున్న ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌ను డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్లు అడ్డుకున్నారు. అరగంటకు పైగా బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్‌ను ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. డీఈఓ పూల్‌లో ఉన్న పండిట్లను రెండేళ్లకోసారి బలవంతపు బదిలీలు చేస్తున్నారన్నారు. గత ఆరేళ్లలో ఇది నాలుగోసారి బదిలీ అన్నారు. గత రెండేళ్లలో సర్దుబాటు పేరుతో మరొక చోటుకి పంపారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,300 మంది పండిట్లు డీఈఓ పూల్‌లో ఉంటే ఉమ్మడి జిల్లాలోనే 111 మంది ఉన్నారన్నారు. వీరిలో తెలుగు 89 మంది, హిందీ 14, ఉర్దూ ఏడుగురు, కన్నడ ఒకరు ఉన్నారన్నారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించగా... 2024, డిసెంబర్ 20న జస్టిస్ మన్మధరావు ధర్మాసనం (సింగిల్ బెంచ్) పండితులకు అనుకూలంగా తుది తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. 2019 నుంచి అందాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించి 3 నెలల గడువులో ప్రమోషన్ ఇవ్వాలంటూ ఆదేశించారన్నారు. పలుమార్లు విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదున్నారు. ఇంతలో ఎస్జీటీ సంఘాల నాయకులు స్టేటస్ కో తెచ్చి సమస్యను మరింత జటిలం చేశారని వాపోయారు. ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చివరకు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ తీరుతో వలస కార్మికుల్లాగా బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సరైన న్యాయం చేయాలని కోరారు. ఎస్జీటీల బదిలీల అనంతరం చర్యలు తీసుకుంటామంటూ ఆర్జేడీ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తివేయాలి



పాదయాత్రలో రంగయ్యతో కలిసి పాల్గొన్న మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ (చిత్రంలో) పార్టీ నేతలు ఉమా, తిప్పేస్వామి

- విదేశీ నిధులు రాకుండా అడ్డుకట్ట వేయడం దారుణం
- ఆర్డీటీని కాపాడుకునేందుకు ఇప్పటికైనా సీఎం చంద్రబాబు కళ్లు తెరవాలి
- మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

కళ్యాణదుర్గం: ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ డిమాండ్ చేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలంటూ మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు గురువారం ఆయనతో పాటు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మద్దతు తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ఆర్డీటీ వరదాయినిగా ఉందన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా కార్యక్రమాలను చేపడుతూ పేదలకు అన్ని విధాలుగా అండగా ఉందన్నారు. ఆర్డీటీని కాపాడుకునేందుకు జిల్లాలో ఉన్న టీడీపీ ప్రజాప్రతినిధులు, సీఎం చంద్రబాబు ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి ఆర్డీటీకి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. ఆర్డీటీకి విదేశీ నిధులు అందకుండా తీసుకొచ్చిన నల్ల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఆర్డీటీ లేకపోతే జరిగే నష్టాన్ని గుర్తించి ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ కోసం రంగయ్య పాదయాత్ర చేపట్టడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వమే స్వయంగా వచ్చి పాదయాత్రను అడ్డుకునేందుకు యత్నించినా ప్రజల సహకారంతో రంగయ్య పాదయాత్ర ముందుకెళ్తోందన్నారు. ప్రజలు సమైక్యంగా పాదయాత్రకు కదలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ భీమేష్, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడుతో పాటు పలువురు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ఆర్డీటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

హంద్రీ–నీవా కాలువ గట్టుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



కాలువ ఎగువ భాగాన గట్టుకు ఎర్రమట్టితో మరమ్మతులు చేసిన దృశ్యం

కూడేరు: మండలంలోని తిమ్మాపురం వద్ద హంద్రీ–నీవా 235.500 కిలోమీటర్ వద్ద కాలువ గట్టుకు ఎర్ర మట్టిని తోలి మరమ్మతులు చేశారు. ఈ గట్టు మట్టిని కాలువ లైనింగ్ పనుల కోసమని కాంట్రాక్టర్ జేసీబీతో తవ్వి తరలించడం గట్టు మొత్తం గుంతలమయమైంది. దీంతో కాలువ ఎగువన ఉన్న ఓబిరెడ్డి కుంటలోకి వర్షం చేరుకుంటే కోతకు గురయ్యే ప్రమాదం ఉండేది. అలాగే దిగువన కాలువకు మట్టి తీయడంతో దెబ్బతిని తిమ్మాపురం గ్రామం ముంపునకు గురయ్యే ప్రమాదముంది. ఈ అంశాలపై 'హవ్వా..ఇదేం లైనింగ్' శీర్షికతో ఈ నెల 9న 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు.. ప్రమాదకరంగా మారిన కాలువ గట్టుకు రాళ్ల చట్టం ఏర్పాటు చేసి ఎర్రమట్టితో చదును చేయించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుంతకల్లు టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ 6వ ప్లాట్‌ఫాం లోని వెయిటింగ్ హాల్ వద్ద గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని ఓ వృద్ధుడు మృతి చెందాడు. అనారోగ్యంతో మృతి చెందినట్లుగా తెలుస్తోంది. ఆచూకీ తెలిసిన వారు 9866144616 నంబర్‌కు సమాచారం అందించాలని జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యక్తి మృతి కేసులో ఐదుగురికి రిమాండ్

రాప్తాడు రూరల్: ఇంటి ఎదుట రోడ్డు స్థలం విషయంలో గొడవ చోటు చేసుకుని ప్రత్యర్థులు తోసేయడంతో కిందపడి వృద్ధుడు మృతి చెందిన కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ తెలిపిన మేరకు... రాచానపల్లి పంచాయతీ నల్లనరసింగయ్యకాలనీలో నివాసముంటున్న కోనయ్య కుమార్తె విదేశాల్లో స్థిరపడింది. తనకున్న 5 సెంట్లకు పైగా స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాలని తండ్రికి తెలపడంతో మూడు రోజుల క్రితం ఆ ప్రాంతాన్ని కోనయ్య శుభ్రం చేయించి, మార్కింగ్ వేయిస్తున్న సమయంలో రోడ్డు స్థలాన్ని ఆక్రమించారంటూ పక్కనే నివాసముంటున్న గంగాధర్, ఆయన బంధువులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో వారు కోనయ్యను తోసేయడంతో వెనుక వైపు కిందకు పడిన ఆయన తలకు తీవ్ర గాయమైంది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు...గంగాధర్‌తో పాటు మరో నలుగురిని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పశుశాఖ జాబితాలు పట్టుకొచ్చిన ప్రత్యేకదూత

- ఇంకా వెల్లడి కాని వ్యవసాయశాఖ ఏడీఏల బదిలీలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ, దాని అనుబంధశాఖల్లో జరుగుతోన్న ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రసహనంగా కొనసాగుతోంది. నిబంధనలు గాలికి వదిలి ఇష్టారాజ్యంగా బదిలీ ఉత్తర్వులు వెల్లడైనట్లు ఉద్యోగ వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి బదిలీ ప్రక్రియను గందరగోళంగా మార్చినట్లు చెబుతున్నారు. ఈ నెల 9 నాటికే బదిలీ ప్రక్రియ ముగిసినట్లు ప్రభుత్వం ప్రకటించినా ఇంకా కొన్ని జాబితాలు వెల్లడి కాకపోవడం విశేషం. వ్యవసాయశాఖ ఏఓల జాబితాలో కొన్ని మార్పులు చేర్పులతో గురువారం రెండోసారి విడుదల చేశారు. ఇక ఏడీఏల జాబితా వెనక్కి తీసుకుని మూడు రోజులవుతున్నా విడుదల చేయకపోవడం గమనార్హం. ఇక పశుసంవర్ధకశాఖలో వింత పోకడ కనిపించింది. డిప్యూటీ డైరెక్టర్లు (డీడీ), అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీ), పశువైద్యులు (వీఏఎస్) బదిలీ జాబితా అలా విడుదల చేసి తక్షణమే అభయెన్స్ పెట్టడంతో అయోమయం నెలకొంది. తిరిగి జాబితాను మెయిల్ లేదా ఆన్‌లైన్ లేదా సర్క్యులర్ రూపంలో పంపాల్సిన డైరెక్టరేట్ అధికారులు... విజయవాడ నుంచి ప్రత్యేకదూత ద్వారా గురువారం జాబితాలను జిల్లా జేడీ కార్యాలయానికి చేర్చడం విడ్డూరంగా ఉంది. అయినా బదిలీ జాబితా అధికారికంగా విడుదల చేయకపోవడంతో ఉద్యోగుల్లో టెన్షన్ కొనసాగుతోంది. నిబంధనలు, పారదర్శకతకు పాతరేయడంతో బదిలీల సమస్య ఇలా తయారైందని ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి. ప్రజాప్రతినిధుల సిఫారసులు, పలుకుబడితో పాటు కొన్ని స్థానాలు, కొందరు వ్యక్తుల కోసం పెద్ద మొత్తంలో డబ్బు చేతులు మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

మందుబాబుల మధ్య ఘర్షణ

- బీరు బాటిల్‌తో పొడవడంతో ఒకరికి గాయాలు



ఘర్షణలో గాయపడిన మధు

గుంతకల్లు టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని వైన్ షాపు వద్ద గురువారం సాయంత్రం ఇద్దరు మందు బాబుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని, ఒకరిపై హత్యాయత్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆచారమ్మ కొట్టాలకు చెందిన మధు గురువారం మద్యం బాటిల్ కొనుగోలు చేసి బయటకు వస్తుండగా 'బెగ్గర్‌లు కూడా తాగని చీప్ లిక్కర్ తాగుతున్నావా?' అంటూ కాలవగడ్డ ప్రాంతానికి చెందిన సుధాకర్ హేళనగా మాట్లాడాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరుకుంది. ఆవేశానికి లోనైన సుధాకర్ పక్కనే ఉన్న బీరుబాటిల్ తీసుకునిబద్దలుగొట్టి మధుపై దాడికి ప్రయత్నించాడు. తప్పించుకుని పారిపోతున్న మధుపై వెనుక నుంచి బీరుబాటిల్ ముక్కతో బలంగా పొడవడంతో తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ మనోహర్ ఘటనపై ఆరా తీసి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నిరుద్యోగులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

- రూ.8 లక్షలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన దేరవకొండ ఏఎస్పీ మౌనిక

దేవరకొండ (నల్లగొండ): ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి నుంచి రూ.17లక్షలు వసూలు చేసి పరారైన నిందితుడిని గురువారం నల్లగొండ జిల్లా దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను దేవరకొండ ఏఎస్పీ మౌనిక గురువారం విలేకరులకు వెల్లడించారు. అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన మాదిన్నె కృష్ణ అలియాస్ వేణుగోపాలరెడ్డి 2021లో దేవరకొండకు వలస వచ్చి బీఎన్ఆర్ కాలనీలో నివాసమేర్పరుచుకున్నాడు. తాను ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్నట్లు చుట్టుపక్కల వారిని నమ్మించాడు. తాను పనిచేస్తున్న శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కాలనీకి చెందిన ముదావత్ స్వాతి, ఆమె భర్త రమేష్, షేక్ సైదాబేగం, ఆమె కుమారుడు షేక్ తబ్రీజ్‌కు నమ్మబలికి వారి వద్ద నుంచి సుమారు రూ.17లక్షలు వివిధ దఫాలుగా తీసుకున్నాడు. డబ్బులు ఇచ్చిన వారు ఉద్యోగాల విషయం ఏమైందంటూ అడిగినప్పుడల్లా టైం పడుతుందని చెబుతూ కాలం వెళ్లదీశాడు. ఇటీవల వారు గట్టిగా నిలదీయడంతో ఇంటికి తాళం వేసి అజ్ఞాతంలోకి వెళ్లాడు. దీంతో బాధితులు ఈ ఏడాది మార్చి 1న దేవరకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఏపీలోని అనంతపురం జిల్లాలో వేణుగోపాలరెడ్డిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి రూ.8లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, కృష్ణ గతంలో తన భార్యతో కలిసి ఖమ్మం జిల్లా తనికెళ్ల గ్రామంలో టైలరింగ్‌తో జీవనం కొనసాగించేవాడని, టైలరింగ్ ద్వారా వచ్చే డబ్బులు సరిపోక అక్కడ కొద్దిమందితో కలిసి చిట్టీలు నిర్వహించి అక్కడి నుంచి అనంతపురానికి ఉడాయించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ పలువురిని మోసం చేసి దేవరకొండకు వచ్చాడన్నారు. కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ నర్సింహులు, ఎస్ఐలు కోటేష్, నారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది సతీష్, రాజారాం, అంజి, వెంకన్న, చాంద్‌పాషా, సింహాద్రి పాల్గొన్నారు.

చెరువుల్లో ఆక్రమణలు తొలగించండి

అనంతపురం అర్బన్: చెరువులు, వాగులు, వంకల గట్లపై ఆక్రమణల తొలగించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో జిల్లాస్థాయి నిఘా కమిటీ సమావేశం నిర్వహించారు. భారీ వర్షాలు కురిసి వరదలు వస్తే ఆక్రమణల కారణంగా పరివాహక ప్రాంతాలు ముంపునకు గురవుతాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులు, వాగులు, వంకలు, చెరువుల గట్లపై ఉన్న ఆక్రమణలను గుర్తించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో మునిసిపల్ కమిషనర్, రెవెన్యూ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు బృందంగా వెళ్లి ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు బృందంగా ఏర్పడి ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ ఎ.మలోల, ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి, పంచాయతీరాజ్, టౌన్‌ప్లానింగ్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ సెంటర్‌లో త్వరితగతిన ఏర్పాట్లు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్‌లో ఏర్పాటు కానున్న రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ కేంద్రంలో త్వరితగతిన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జేఎన్‌టీయూ (ఏ) పాత పాలక భవనాన్ని పరిశీలించారు. సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో సెంటర్ ప్రారంభించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ వి. రాజగోపాల్, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, ఏడీ రాజశేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ బాల కాటమయ్య, ఏఈలు పాల్గొన్నారు.

'పది సప్లిమెంటరీ' ఫలితాల్లో 15వ స్థానం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. ఫలితాలు గురువారం సాయంత్రం విడుదలయ్యాయి. రాష్ట్రంలో 98.24 శాతం మంది ఉత్తీర్ణతతో ప్రకాశం జిల్లా మొదటిస్థానంలో నిలవగా, 50.24 శాతం ఉత్తీర్ణతతో తూర్పుగోదావరి జిల్లా చివరి స్థానంలో నిలిచింది. అనంతపురం జిల్లా 76.29 శాతం ఉత్తీర్ణతతో 15వ స్థానం దక్కించుకుంది. మొత్తం 9,445 మందికి గాను 7,206 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 5,771 మందికి గాను 4,231 మంది 73.31 శాతం, బాలికలు 3,674 మందికి గాను 2,975 మంది 80.97 శాతం పాసయ్యారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎం ఎఫ్ఎంఈ) కింద కుటీర పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలతో ప్రోత్సాహం అందిస్తామని ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్ కేజే మారుతి తెలిపారు. గురువారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో హెచ్ఓ రత్నకుమార్‌తో కలిసి రిసోర్సు పర్సన్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. యూనిట్ విలువలో 10 శాతం లబ్ధిదారులు భరిస్తే... 35 శాతం ప్రభుత్వం రాయితీ రూపంలో అందిస్తుందన్నారు. మిగిలిన 55 శాతం బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. గరిష్టంగా రూ.10 లక్షల వరకు రాయితీ వర్తిస్తుందన్నారు. వేరుశనగ ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్లకు (వేరుశనగ నూనె, చిక్కీల తయారీ లాంటివి) ప్రాధాన్యత ఉంటుందన్నారు. పొటాటో చిప్స్, చెక్కిలాలు, ఊరగాయలు, రోటీ మేకర్, రెడీ టు ఈట్ ప్రొడక్ట్స్, శనగపప్పు, బేకరీ ఉత్పత్తులు, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులు, బొరుగులు, రైస్ బేస్డ్ ప్రొడక్ట్స్, అరికా నట్స్, చింతపండు తదితర మరో 20 నుంచి 30 రకాల ఉత్పత్తుల తయారీకి రాయితీలు వర్తిస్తాయన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు గ్రామాల్లో ఆర్ఎస్‌కేల్లో లేదా ఉద్యాన శాఖ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

విమాన ఘటన బాధాకరం

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: అహ్మదాబాద్ విమానాశ్రయం సమీపంలో ఎయిర్ ఇండియా ఏ1–171 విమానం కూలిపోయిన ఘటనలో 242 మంది మృతి చెందడం బాధాకరమని మేయర్ వసీం పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రేపు జనార్దుడికి జేష్ట్యాభిషేకం

అనంతపురం కల్చరల్: ఈనెల 14న అనంత వేదికగా వినూత్నంగా సాగనున్న జనార్దుడికి జేష్ట్యాభిషేకం పోస్టర్లను వ్యాసరాయ పీఠం పీఠాధిపతి తీర్థ శ్రీపాదులు గురువారం ఆవిష్కరించారు. సాయిట్రస్టు ప్రతినిధి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. స్థానిక హౌసింగ్ బోర్డులోని అభయాంజనేయస్వామి ఆలయం వేదికగా 'వైకుంఠవాసుని సేవలో ఒకరోజు వేంకటేశ్వరస్వామి వైభవం' పేరిట ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు జనార్దునికి జేష్ట్యాభిషేకం జరుగుతుందన్నారు. శ్రీదేవి, భూదేవి సమేత తిరు కల్యాణోత్సవం, తిరుప్పాడ సేవ, 108 హారతులతో పాటూ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, విజయభాస్కర్, మఠం ప్రతినిధి రఘునాథ్, అనిల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బెంచీల వితరణ



బెంచీలతో హెచ్‌ఎం, టీచర్లు, పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలో శ్రీపొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.52 వేల ఖరీదైన బెంచీలను పాఠశాలకు వితరణ చేశారు. 1976–77 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు గురువారం పాఠశాలకు వెళ్లారు. విద్యాభ్యాసం చేసిన పాఠశాలకు గుర్తుగా 20 బెంచీలను హెచ్‌ఎం ఎం.శ్రీదేవి, టీచర్లు సి.ఇఫ్తికార్, జి.తులసిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎం.మనోహర్, జే.రామిరెడ్డి, పి.హరినాథ్, ఎంఎస్ఆర్ దీక్షిత్, జి.వన్నప్ప, షేక్ మహబూబ్‌బాషా, ఎస్ఎండీ సలీంబాషా, ఎం.వెంకటరామిరెడ్డి, ఎంవీ మల్లికార్జున, ఆర్.శ్రీనివాసరావు, షేక్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: మొక్కలను కన్న బిడ్డల్లాగా సంరక్షించాలని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్' పిలుపులో భాగంగా ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనాథ్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్ రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ

అనంతపురం కల్చరల్: ఆదర్శ నగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో గురువారం నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ నిర్మల మురళీ 22 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, చాక్లెట్లు, జ్యూస్ పాకెట్లు, ఇతర విద్యా సామగ్రి వితరణ చేశారు. కార్యక్రమంలో లలిత, భవిత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూజలు చేస్తున్న సోసలె వ్యాసరాజ మఠం పీఠాధిపతి

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సోసలె వ్యాసరాజ మఠం పీఠాధిపతి శ్రీపాద తీర్థ స్వామి అన్నారు. హైందవ ధర్మప్రచారంలో భాగంగా అనంతకు విచ్చేసిన స్వామి గురువారం పాతూరులోని వ్యాసరాజ మఠంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులతో సంస్థాన పూజలు, ఆలయంలో కొలువుదీరిన రాఘవేంద్ర స్వామి, వ్యాసరాజులు, ఆంజనేయ స్వామి, లక్ష్మీనరసింహస్వామి దేవతామూర్తులకు అభిషేకాలు, అలంకార సేవలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహభాషణంలో భక్తిమార్గం గొప్పతనాన్ని, విలువలు, సనాతన సంప్రదాయాలను పాదు చేసుకోవాల్సిన అవసరం గురించి ప్రసంగించారు. అంతకు ముందు పలువురు భక్తులకు పవిత్ర ముద్రధారణ చేశారు. కార్యక్రమంలో మఠం అధికారి శ్రీకాంత్, మేనేజర్ హరినారాయణ, నాగరాజా రావు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనం.. నిర్వహణ లేక శిథిలం

మండల కేంద్రం కనగానపల్లిలో రూ.లక్షల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఇరిగేషన్ (జలవనరుల శాఖ) భవనం నిరుపయోగంగా ఉంది. గతంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పక్కన రూ.19.8 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. దీనిని నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా.. ఇంతవరకు ఈ భవనాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు ఉపయోగించ లేదు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారి, శిథిలావస్థకు చేరుకునే పరిస్థితిలో ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ భవనాన్ని వినియోగించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – కనగానపల్లి:



కనగానపల్లిలో నిరుపయోగంగా ఉన్న ఇరిగేషన్ భవనం

కంపచెట్లు తొలగిస్తే ఒట్టు..

ఆత్మకూరులో నార్త్ పాఠశాల వద్ద రోడ్డు పక్కన పాఠశాలకు ఆనుకొని పెద్ద ఎత్తున చెత్తా చెదారంతో పాటు ముళ్ల కంపలు పెరిగాయి. ముళ్లకంపలు ఏకంగా తరగతి గదుల్లోకి చొచ్చుకొచ్చాయి. వీటితో విషపురుగులు పాఠశాలలోకి ప్రవేశించే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన పాఠశాలకు ఆనుకుని ఉన్న కంపచెట్లు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – ఆత్మకూరు:



పాఠశాల తరగతి గది పక్కన ఏపుగా పెరిగిన కంపచెట్లు

హామీలు అమలు చేయరా?

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతోంది. హామీలు నెరవేర్చకుండా యువత, విద్యార్థులు, తదితర అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేస్తూ కాలయాపన చేస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్ర రెడ్డి మండిపడ్డారు. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన మోసాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన చంద్రబాబు ఇంత వరకు వాటి అమలుపై స్పష్టం ఇవ్వలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేసిందన్నారు. కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రులను ఒత్తిళ్లకు గురి చేసిన సందార్భాలు చాలా ఉన్నాయన్నారు. నీకు రూ.15000.. నీకు రూ.15వేలు అంటూ ప్రతి ఇంటిలో ఎంత మంది ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని చెప్పి మాటతప్పారన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నిరుద్యోగులకు 1,25,000 ఉద్యోగాలు భర్తీ చేశారని గుర్తు చేశారు. వలంటీర్ వ్యవస్థతో మరో రెండున్నర లక్షల మందికి ఉపాధి కల్పించారన్నారు. వైద్య రంగంలో 50 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు మాటల గారడీ తప్పితే ప్రజలకేం చేయడం లేదన్నారు. యువత, విద్యార్థులను ఆదుకోకపోతే వైఎస్సార్‌సీపీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి వెనుకాడబోదన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగరాధ్యక్షుడు శ్రీనివాస్ దత్తా, విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాష్, నాయకులు సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, సాకే చంద్రశేఖర్

'ఆకృత్యాలకు అడ్డుకట్ట వేయండి'

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో మహిళలు, యువతులు, మైనర్ బాలికలపై దాడులు అధికమయ్యాయి. మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలకు అడ్డుకట్ట వేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లు వినతిపత్రం అందించారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడుగుర్రాలపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని గైనకాలజిస్టులను ఆదేశించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాళ్లు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో తన్మయి అనే యువతి దారుణ హత్యకు గురైందన్నారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే యువతి మృతి చెందిందని ఆరోపించారు. యువతిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నాయకురాళ్లు శోభారాణి, కేఎల్ దేవి, శోభాబాయి, పార్వతి, భారతి, చంద్రకళావతి, లక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అత్యాచారం చేసిన వారిని శిక్షించాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఇటీవల రామగిరి మండలంలో ఒక దళిత మైనర్ బాలికపై 18 మంది అత్యాచారం చేసినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుల నిర్లక్షంతో ఈ హత్య జరిగిందని.. పోలీసులపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను సస్పెండ్ చేసినట్లే రామగిరి పోలీసులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బ్లూ కండువాలు వేసుకొచ్చి వచ్చి మాకేమి చేప్పే పని లేదని.. మాపని మీము చేస్తామంటూ చైర్‌పర్సన్ అనాలోచితంగా మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే కుల, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పసలూరి ఓబులేసు, నరేష్ కొడవండ్ల, మదమంచి శ్రీనివాసులు, చెన్నకేశవులు, రామకృష్ణ, పులికిష్ట, వీరనారప్ప సురేష్, వీరేంద్ర, చిన్న, గోవర్దన్, ఎర్రిస్వామి, దావీదు, నారాయణ స్వామి, వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన మతిస్థితిమితం లేని తలారి నాగేంద్ర అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. పట్టణంలోని శెట్టూరు రోడ్డు సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. నాగేంద్ర ఆచూకీ తెలిస్తే సెల్: 9849363499,8555900502 సమాచారం ఇవ్వాలని పట్టణ పోలీసులు తెలిపారు.



కుమ్మేసిన వాన

రహమత్ నగర్ ఓవర్ బ్రిడ్జ్ వద్ద వస్తున్న వర్షపు నీరు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో గురువారం ఉదయం కురిసిన కొద్దిపాటి వర్షం నగరాన్ని తడిపేసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహన రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రహమత్ నగర్, హనుమాన్ కాలనీ, యువజన కాలనీ, రాంనగర్, కోవూర్ నగర్, ఎర్రనేల కొట్టాలు, 5, 6వ రోడ్డు, రజకనగర్, సోమనాథ్ నగర్, కమలానగర్, తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. వాహనదారులు, పాదాచారులు వెళ్లడానికి అవస్థలు పడ్డారు. కొద్దిపాటి వర్షానికే ఈ పరిస్థితి ఉంటే ఇక భారీగా వర్షం వస్తే ఏమిటని నగర వాసులు అంటున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో రజక్‌నగర్ ప్రొటెక్షన్ వాల్ నిధులను చెరువుకట్టకు డైవర్ట్ చేశారు. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రజక్ నగర్, గౌరవ గార్డెన్, యువజన కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయం తీసుకోగా ఎన్నికలు వచ్చాయి. దీంతో ఆ పనులకు బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వంలో ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పి ప్రజాప్రతినిధులు మాట తప్పారని నగరవాసులు మండిపడుతున్నారు.



అనంతపురంలో జోరుగా కురుస్తున్న వర్షం

కార్మికుల తొలగింపు అన్యాయం

అనంతపురం అర్బన్: విశాఖ ఉక్కు పరిశ్రమలో 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించి వారి కుటుంబాలను రోడ్డపాలు చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి జె.రాజారెడ్డి ధ్వజమెత్తారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ ఏఐటీయూజీ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక జడ్పీ కార్యాలయ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు హక్కుగా భావించే విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేయాలని చూస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తానా అంటే రాష్ట్ర ప్రభుత్వం తందానా అంటోందని ఎద్దేవా చేశారు. పరిశ్రమ కోసం వేల ఎకరాలు భూములు ఇచ్చిన రైతులు, ఏళ్లగా పనిచేస్తున్న కార్మికులను మోసం చేస్తున్నారని మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కుకు ప్రత్యేక ప్యాకేజీ బడ్జెట్‌ను కేంద్రం నుంచి తెచ్చామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. దొడ్డిదారిలో ప్రైవేటీకరణకు సహకరిస్తోందని మండిపడ్డారు. ప్రైవేటీకరణలో భాగంగానే 2,500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ కృష్ణుడు, మునిసిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు రాజు, రామాంజనేయులు, రామకృష్ణ, వేణుగోపాల్, అక్బర్, నారాయణ, శివకృష్ణ, కృష్ణానాయక్, దుర్గాప్రసాద్, ప్రశాంత్, రమేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

'ఆరోగ్య విషయాలపై నిర్లక్ష్యం వద్దు'

ఆత్మకూరు: ఆరోగ్య విషయాలపై నిర్లక్ష్యం వద్దు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా తెలిపారు. గురువారం మండలంలోని బి.యాలేరులో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచరాదన్నారు. నీటి తొట్టెలను శుభ్రం చేయించారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటం వల్ల లార్వా చేరి విష జ్వరాలు వ్యాపిస్తాయని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు వెంటనే ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పౌష్టికాహారంతో పాటు ఆకుకూరలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ షమీమ్‌తార, సూపర్‌వైజర్ వెంకటరత్నమ్మ, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



యాలేరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థుల చేతుల్లోనే బంగారు భవిష్యత్తు

అనంతపురం ఎడ్యుకేషన్: బంగారు భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ టి.శైలజ తెలిపారు. నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకటస్వామి, సరితా రాణి, ప్రధానోపాధ్యాయులు రేణుక, ఏపీఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ బొమ్మయ్య, టీడీపీ నేతలు మనోరంజన్, శశాంక్, శ్రీనివాసులు, మాధవరెడ్డి, రవీందరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, పెదలక్ష్మమ్మ, మాజీ పాఠశాల కమిటీ చైర్మన్ ఓబుళపతి పాల్గొన్నారు.



విద్యార్థికి కిట్ పంపిణీ చేస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, అధికారులు

ఈ–కేవైసీ తప్పనిసరి

బుక్కరాయసముద్రం: రైతులు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లీశ్వరి అధ్యక్షతన నిర్వహించిన 'వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆమె హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రూ. 6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 వేలు జమ చేస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,70,794 మంది లబ్ధి పొందుతారన్నారు. 80 శాతం సబ్సిడీతో డ్రోన్ స్ప్రేయర్లు అందిస్తున్నామని, ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి కొనుగోలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శశికళ, జాహ్నవి, శ్రీనివాస నాయక్, రఘు, చరణ్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: అర్హులైన రైతులందరికీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 1300 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, పసుపుల శ్రీరామిరెడ్డి, సర్పంచులు నారాయణస్వామి, కల్పన, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, హార్టికల్చర్ సహాయకులు మునికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమా మహేశ్వరమ్మ

పట్టుశాఖ అధికారిగా విజయ కుమార్

- ఏపీఎంఐపీ ఏపీడీగా జీసీ ధనుంజయ
- రూరల్ ఏఓగా వెంకటకుమార్

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ, దాని అనుబంధ శాఖల బదిలీల ప్రక్రియలో భాగంగా ఆయా కార్యాలయాల్లో రిలీవింగ్, జాయినింగ్‌లు జరుగుతున్నాయి. జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి (డీఎస్ఓ)గా కర్నూలు నుంచి బదిలీపై వచ్చిన ఐ.విజయకుమార్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అలాగే ఏపీఎంఐపీ ఏపీడీగా బీసీ ధనుంజయ బాధ్యతలు చేపట్టారు. కీలకమైన అనంతపురం రూరల్ మండల వ్యవసాయాధికారిగా నియమితులైన వెంకటకుమార్ డివిజన్ ఏడీఏ ఎం.రవిని కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర క్లరికల్‌స్టాఫ్, అటెండర్లు...ఇలా అన్ని విభాగాలకు సంబంధించిన ఉద్యోగుల బదిలీ ఉత్తర్వుల మేరకు ఆయా శాఖల కార్యాలయాల్లో రిలీవింగ్, జాయినింగ్ కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

కసాపురంలో ధన్వంతరి హోమం



హోమం చేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రజలు ఆరోగ్యంగా వర్ధిల్లాలని కోరుకుంటూ ధన్వంతరి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

హామీలు అమలు చేయకుండా మోసం చేస్తారా?

- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్



అనంతపురం కార్పొరేషన్: ఎన్నికలకు ముందు చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇస్తామన్న చంద్రబాబు.. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఆ పథకం వర్తింపజేయకుండా మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యూడీఐఎస్ఈ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదువుకుంటున్న విద్యార్థులు దాదాపుగా 87,41,885 మంది ఉన్నారని, వారికి ఏడాదికి రూ.13,050 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మంత్రి నారా లోకేష్ రూ.8,745 కోట్లు మాత్రమే ఇస్తున్నట్లు చెప్పారన్నారు. ఈ లెక్కన 58 లక్షల మందికి ఆ డబ్బు సరిపోతుందని.. మిగతా 29 లక్షల మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

తులసి మొక్కల పంపిణీ

అనంతపురం కల్చరల్: సర్వ ఆరోగ్యదాయినిగా ప్రసిద్ధి చెందిన తులసి మొక్కలు ప్రతి ఇంటా ఉండాలనే ఉద్దేశంతో ఉచితంగా అందజేస్తున్నట్లు వక్తలు తెలిపారు. గురువారం స్థానిక శ్రీనివాస నగర్‌లోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులకు తులసి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము, హనుమంతు, శ్రీనివాస్, ప్రసాద్, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శిగా వేమన



అనంతపురం: సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శిగా వేమన నియామకమయ్యారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసిన వేమన.. ఏఐఎస్ఏ విద్యార్థి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తాజాగా సీపీఐ (ఎంఎల్)లో నూతన జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. జిల్లా కమిటీని 15 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. అనంతపురం ఎన్‌జీఓ హోంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మార్మోగిన లలితా చాలీసా



వలీస్వామి ఆశ్రమంలో సామూహిక చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: లలితా చాలీసాతో నగరంలోని సద్గురు వలీస్వామి ఆశ్రమం మార్మోగింది. గురువారం హెచ్చెల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో లలితా చాలీసా, వేంకటేశ్వర స్వామి గోవిందనామాలు, కనకధార స్తోత్ర పారాయణాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు దేవనూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి అందరిలో చైతన్యం నింపేదిశగా సామూహిక పారాయణం చేయిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు సద్వినియోగం చేసుకోవడం శుభపరిణామన్నారు. వలీస్వామి విశిష్టత గురించి ప్రసంగం, ఆశ్రమంలో కొలువుదీరిన దేవతామూర్తులకు పూజల అనంతరం ప్రసాద వితరణ చేశారు.

వ్యక్తి మృతి

గుత్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గుత్తి ఆర్ఎస్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్ఎస్‌కు చెందిన డిష్ చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతడిని బంధువులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్టు

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురంలో గురువారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేశామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.33వేలు నగదు, 8 సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.